
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

మంగళవారం 1 అక్టోబరు 2024

పంటల సర్వే సందిగ్ధం!

- డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈవోల విముఖత
- సరిపడా సిబ్బంది లేకపోవడంతో చేతులెత్తేసిన వైనం
- ఈ సీజన్‌లో సర్వే జరగడం కష్టమే?



జనగామ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేపై సందిగ్ధత ఏర్పడింది. పంటల సర్వేకు తాము ముందుకు రాలేమంటూ రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విస్తరణాధికారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో మండలాల వారీగా సరిపడా ఏఈవోలు లేకపోవడంతో పనిభారం అవుతుందంటూ చేతులెత్తేశారు. ఇదే విషయంపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏఈవోలు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇస్తుండగా, తాజాగా జనగామ జిల్లాలోనూ ఏఈవోలు పంటల సర్వేకు దూరంగా ఉంటున్నామంటూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ రామారావుకు సోమవారం లేఖ ఇచ్చారు. దీంతో డిజిటల్ క్రాప్ సర్వేపై అయోమయం నెలకొంది.

భవిష్యత్తు ప్రణాళికల కోసం..

దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించి అవసరమైన పక్కా ప్రణాళికలను తయారు చేసేందుకు గానూ కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ అగ్రి మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే డిజిటల్ క్రాప్ సర్వే(డీసీఎస్)ను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రాల్లో ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయన్న పక్కా సమాచారాన్ని క్రోడీకరించి భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నది కేంద్రం ఉద్దేశ్యం. ఇందులో భాగంగా గత ఏడాది తీసుకొచ్చిన ఈ కార్యక్రమం దేశంలోని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిషా వంటి రాష్ట్రాలలో గత ఏడాది నుంచే అమలు అవుతోంది. తెలంగాణలో మాత్రం ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

సరిపడా సిబ్బంది లేక..

పంటల సర్వే నేపథ్యంలో జిల్లాలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో తాము సర్వే చేయలేమంటూ ఏఈవోలు చేతులెత్తేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 12 మండలాల పరిధిలో 62 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో సుమారు 6 వేల నుంచి 10 వేల ఎకరాల వరకు భూములు ఉంటాయి. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో ఏఈవో ఉండగా జిల్లాలో 62 మంది ఏఈవోలు ఉన్నారు. ఇందులో 40 మంది మహిళా ఏఈవోలే ఉన్నారు. కాగా.. ఒక్కో ఏఈవో తమ క్లస్టర్ పరిధి మొత్తాన్ని సర్వే చేయడం కష్టతరమైన పనిగా చెబుతున్నారు. గత ఏడాది క్రాప్ బుకింగ్‌కు సంబంధించి జనగామ జిల్లాలో జనగామ మండలాన్ని పైలట్ కింద తీసుకొని సర్వే నిర్వహించారు. ఆ సమయంలో జనగామ మండలంతో పాటు నర్మెట్ట, బచ్చన్నపేట మండలాలకు చెందిన 14 మంది ఏఈవోలకు పైలట్ మండలంలో క్రాప్ బుకింగ్ బాధ్యతలు ఇచ్చారు. ఈ 14 మంది ఏఈవోలు ఒక్క జనగామ మండలంలో సర్వే పూర్తి చేయడానికి మూడు నెలల సమయం పట్టింది. ఈ లెక్కన ఒక్కో ఏఈవో తమ క్లస్టర్‌లో సర్వే పూర్తి చేయాలంటే ఆరు నెలల పడుతుందని ఏఈవోలు అంటున్నారు.

పంటల ఫోటోలతో సహా సర్వే

ప్రభుత్వం చెబుతున్న సర్వే విధివిధానాలపై ఏఈవోలు అయిష్టంగా ఉన్నారు. గతంలో పైలట్ కింద చేసిన సర్వేలో కేవలం పంటల వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉండగా ఈసారి చాలా వరకు మార్పులు చేశారు. ప్రతి ఏఈవో తమ క్లస్టర్ పరిధిలోని ప్రతి రైతు, ప్రతి ఎకరం, ప్రతి పొలం వద్దకు వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుంది. రైతు పేరు, సర్వే నంబర్, సబ్ సర్వే నంబర్, ఆయా సర్వే నంబర్లలో ఏయే పంటలు సాగు చేశారు అన్న వివరాలతో పాటు పంట ఫొటోలు కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ క్రమంలో ఏఈవో ఉన్న ప్రాంతం నుంచి అక్షాంశాలు, రేఖాంశాలు యాప్‌లో నమోదు అవుతాయి. దీని వల్ల ఏఈవో కచ్చితంగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో పాటు పలు ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య వల్ల క్రాప్ బుకింగ్ సర్వే ఆలస్యం అవుతోంది. రిమోట్ ప్రాంతాల్లో ఫోన్లలో చార్జింగ్ అయిపోవడంతో పాటు మహిళా ఏఈవోలకు వ్యక్తిగతంగా ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏఈవోలు పంటల సర్వేకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఇతర రాష్ట్రాల్లో పంటల సర్వే కోసం ఏఈవోలకు సహాయకులను కేటాయించారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులపై పని ఒత్తిడి పడడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో ఏజెన్సీల ద్వారా సహాయకులను నియమించారు. ఇదే క్రమంలో తెలంగాణలో ఏఈవోకు సహాయకులను కేటాయిస్తే సర్వేకు తాము సిద్ధమేనని అంటున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా.. ప్రస్తుతం వానాకాలం సీజన్ సాగు పూర్తయి వరి పంట కోతల సీజన్ కూడా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఏఈవోలు సర్వేకు సిద్ధపడి ఇప్పటికిప్పుడు ప్రారంభించినా వానాకాలం పంటల సాగు సర్వే పూర్తి చేయడం అసాధ్యమన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో ఏఈవో సమస్యలను పరిష్కరించి వారికి అవసరమైన శిక్షణ, ట్యాబ్‌లు అందించి రబీ సీజన్ నుంచి సర్వే ప్రారంభిస్తే బాగుటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావుకు లేఖ ఇస్తున్న ఏఈవోలు

ఏఈవోలకు సహాయకులను ఇవ్వాలి..

- గుగులోత్ యాకూబ్, ఏఈవో, చిల్పూరు



పంటల సర్వే కోసం ఏఈవోలకు సహాయకులను కేటాయించాలి. ఎలాంటి సహాయకులను ఇవ్వకుండా సర్వే చేయడం కష్టమైన పని. కొన్ని చోట్ల ఒక్కో ఏఈవోకు తన క్లస్టర్ పరిధిలో 12 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. దీని వల్ల పనిభారం అధికంగా పడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని 5 వేల ఎకరాలకు ఒక్క ఏఈవోను నియమిచాలి. అవసరమైతే అదనంగా ఏఈవోల నియామకం జరపాలి. ఏఈవోలు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నందున ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

ప్రజావాణి దరఖాస్తులను

వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ఆర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, సెప్టెంబరు 30: ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలిసి మొత్తం 47 ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీల పట్ల ఎటువంటి అలసత్వం వహించరాదని, సమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరి ష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్‌డీవో వసంత, ఆర్డీవోలు కొంరయ్య, వెంకన్న, డీఈవో రాము, డీపీవో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డు వివాదం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

తిరుపతి లడ్డు వివాదం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) నాయకులు కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ హిందు దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం వైదొలగాలన్నారు. పూజ్య పీఠాధిపతులు, స్వామీజీలు, ఆధ్యాత్మిక, సామాజిక వేత్తలతో ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసి దేవాలయ వ్యవస్థను నిర్వహించాలన్నారు. దేవాలయాలలో అన్యమత ఉద్యోగులను తొలగించాలని, ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అందుకు కలెక్టర్ సైతం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలి



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జనగామ రూరల్. సెప్టెంబరు 30: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎలగందుల చంద్ర ఋషి మాట్లాడుతూ న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. అమెండ్‌మెంట్, టెన్యూర్ పీపీల నియామకం పాత పద్ధతిలో కొనసాగించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.నేటి నుంచి రిలే నిరహర దీక్షలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నక్క సిద్దులు, లక్ష్మణస్వామి, మంచాల రవీందర్, సత్తయ్య, ఎల్లారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్. స్వప్న, రేఖ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా

ఒకరికి తీవ్రగాయాలు, 20 మందికి స్వల్పగాయాలు

జనగామ జిల్లా యశ్వంతాపూర్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఘటన





బస్సులో ఇరుక్కున్న ప్రయాణికుడిని తీసేందుకు బస్సును లేపుతున్న స్థానికులు, క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

జనగామ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలు కాగా 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా జనగామ మండలం యశ్వంతాపూర్ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, బస్ డ్రైవర్, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ కంపెనీకి చెందిన బస్సు ఆదివారం రాత్రి ప్రయాణికులతో బెంగుళూరు నుంచి వరంగల్‌కు బయలుదేరింది. ఆదివారం రాత్రి బయలుదేరిన బస్సు సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకుంది. అక్కడ కొంతమంది ప్రయాణికులను ఎక్కించుకొని వరంగల్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఉదయం 10 గంటలకు యశ్వంతాపూర్‌లోని ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం దాటగానే బస్సు కుడి వైపు ముందు టైర్ పేలిపోయింది. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టుకుంటూ 50 మీటర్లు వెళ్లి బోల్తా కొట్టింది. టైర్ పేలడంతో అప్రమత్తమైన డ్రైవర్ బ్రేకులు వేయడానికి ప్రయత్నించినా బస్సు అదుపులోకి రాలేదు. ఇదే క్రమంలో వాలుగా ఉన్న డివైడర్ మీదకు దూసుకెళ్లిన బస్సు బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో 21 మంది ప్రయాణికులు ఉన్నారు. ఊహించని పరిణామంతో ప్రయాణికులు అంతా ఉలిక్కి పడ్డారు. బస్సు బోల్తా పడగానే బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ధ్వంసమైన అద్దాల నుంచి కొంతమంది ప్రయాణికులు బయటకు వచ్చారు. కాగా.. లోపల చిక్కుకున్న ప్రయాణికులను స్థానికులు బయటకు తీసుకువచ్చారు. కాగా.. ఈ ప్రమాదంలో బెంగుళూరు నుంచి వరంగల్‌కు వస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గడ్డిగానిపల్లికి చెందిన బెద్దెల పోచయ్య బస్సులో చిక్కుకొని పోయాడు. ప్రమాద సమయంలో అతడి ఎడమ చేయి కిటికీ ద్వారా బయటకు వచ్చి బస్సు కింద ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయింది. దీంతో అతన్ని బయటకు తీయడం కష్టంగా మారింది. కాగా.. ఘటనపై సమాచారం అందుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి, జనగామ, రఘునాథపల్లి సీఐలు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు సిబ్బంది, స్థానికులు, జేసీబీల సాయంతో బస్సులో చిక్కుకున్న పోచయ్యను అతికష్టం మీద బయటకు తీసుకువచ్చి జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా.. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ప్రయాణికుల్లో కొంతమంది ఆర్టీసీ బస్సులు ఎక్కి వెళ్లిపోగా, కొంతమందిని తమ కుటుంబ సభ్యులు కార్లలో తీసుకెళ్లారు. కాగా.. బోల్తాకొట్టిన బస్సును జేసీబీ సాయంతో పక్కకు జరిపించి రాకపోకలను పోలీసులు పునరుద్ధరించారు.



ప్రమాదానికి కారణమైన పేలిన టైరు



ప్రయాణికురాలితో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

బతుకమ్మ ఏర్పాట్లను ప్రత్యేకంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఘన్‌పూర్‌లో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30: డివిజన్ కేంద్రంలోని దేవాదుల రిజర్వాయర్ కట్ట పైన హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించే బతుకమ్మ పండుగ ఏర్పాట్లను సంబంధిత సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సోమవారం సాయంత్రం బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. దేవాదుల తూము వైపు లోయగా ఉన్న ప్రదేశంను కడియం పరిశీలించి రేలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కట్ట పైన ఎక్కడాకూడ ఇబ్బందులు రాకుండా లైట్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. కట్ట పక్కన ఇరువైపుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, బతుకమ్మ విగ్రహంకు రంగులు వేసి అలంకిరించాలని, గ్రానైట్ దెబ్బతిన్నందున తిరిగి గ్రానైట్ ఏర్పాటుతో పాటు విగ్రహం చుట్టురా రేలింగ్ ఉండాలన్నారు. బతుకమ్మ పండుగ నిర్వహణ ఏర్పాట్లకు తనవంతుగా రూ 5లక్షలు నిధులు అందిస్తానని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్ధార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ జిల్లా నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, మంతెన ఇంద్రసేనారెడ్డి, అంబటి కిషన్‌రాజ్, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి నాగరబోయిన శ్రీరాములు, తెల్లాకుల రామకృష్ణ, నాయకులు నీల గట్టయ్య, గట్టు రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ

- పోలీసు అధికారుల పనితీరుపై సమీక్ష

జనగామ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జనగామ పట్టణంలోని పోలీసు డివిజనల్ కార్యాలయాన్ని సోమవారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఏసీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, డివిజనల్ పోలీసు అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. తనిఖీ సందర్భంగా ఏసీపీ కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డుల పరిశీలనతో పాటు ఏసీపీ పరిధిలోని పెండింగ్ కేసుల వివరాలు, నేరస్థుల అరెస్టులు, వివిధ కేసుల దర్యాప్తులు, వాటి స్థితి గతులపై అడిగి తెలుసుకున్నారు. అలాగే డివిజనల్ పోలీసు అధికారులతో సమావేశమై వారి పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ పోలీసు అధికారులు బాధ్యతగా విధులను నిర్వర్తించాలన్నారు. పోలీసు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిని సహించేది లేదని హెచ్చరించారు. పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకానికి అనుగుణంగా పని చేయాలన్నారు. డయల్ 100 నుంచి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి.. వేగవంతంగా బాధితులకు సహాయమందించాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన ఏసీపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. జనగామ ఏసీపీ పార్థసారథి, పలువురు సీఐలు పాల్గొన్నారు.



డివిజనల్ పోలీసు అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్



రాజవరంలో దేవాదుల పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ (ఈఎన్‌సీ) అనిల్‌కుమార్

చిలుపూర్, సెప్టెంబరు 30 : దేవాదుల ప్రాజెక్ట్ ఫేజ్ 3 పనుల్లో భాగంగా ప్యాకేజ్ 3, ప్యాకేజ్ 4 పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీ రందించేందుకు దోహద పడాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్) అనిల్‌కుమార్ అధికారులు, నిర్వహకులను ఆదేశించారు. సోమవారం మండలంలోని రాజవరం సమీపంలోని దేవాదుల పంప్‌హౌజ్‌ను ఆయన సందర్శించారు. పంప్‌హౌజులు, టన్నెల్స్, అప్రోచ్ ఛానళ్లకు సంబంధించి చేపడుతున్న పనుల విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ, జనగామ జిల్లాతో పాటు, పార్ట్ సూర్యాపేట, పార్ట్ భువనగిరి, పార్ట్ వరంగల్ రైతాంగానికి సాగునీరందించడంలో భాగంగా ప్యాకేజ్ 3, 4లో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలోనే రెండు పంటలకు నీరందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదుల సీఈలు అశోక్‌కుమార్, వెంకటకృష్ణ, జనగామ ఎస్ఈ సుధీర్, ఈఈ వినయ్‌బాబు, డీఈలు శేషగిరి, సంపత్‌కుమార్, రామకృష్ణ, ఏఈ యాసర్ బేగ్‌తో పాటు, మేగా ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు

హైడ్రాను గ్రామ స్థాయిలో అమలు చేయాలి



పాలకుర్తిలో మాట్లాడుతున్న రమేష్‌రాజా

పాలకుర్తి, సెప్టెంబరు 30 : అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు ఉపయోగిస్తున్న హైడ్రా లాంటి వ్యవస్థను గ్రామ స్థాయిలో తీసుకురావాలని సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కమిటి సమావేశానికి రమేష్‌రాజా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనుమతులు లేకుండా కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చివేయడం సరైన చర్యలని అన్నారు. అయితే నిరుపేదల నిర్మాణాలను తొందరపడి కూల్చొద్దని ప్రభుత్వానికి సూచించారు. అత్యంత నిరుపేదలను గుర్తించి వారికి ప్రత్యామ్నాయంగా చూపించాలని ఆతర్వాత తొలగించాలని అన్నారు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంపన్నులు, రాజకీయ నాయకులు, భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను, చెరువులను, కుంటలను ఆక్రమించి కోట్లకు పడగలెత్తారని అన్నారు. రాజకీయ నాయకులు చెరువులు ఆక్రమించి వెంకచర్లు చేసి అక్రమ రిజిస్ట్రేషన్లు ద్వారా ప్లాట్లు విక్రయించి పేదలకు తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. అటువంటి వారిని గుర్తించి చట్టపరమైన తీసుకోవాలని కోరారు. గ్రామ స్థాయిలో కూడా హైడ్రాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య, జీడి సోమయ్య, కలింగరాజు, సోమయ్య, తాళ్లపల్లి మల్లయ్య ఉన్నారు.

నయీంనగర్ బ్రిడ్జి వద్ద

రణరంగం

- నిర్మాణ ఘనత తమదేనన్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్
- ఖండించేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నం
- ఇరు పార్టీల శ్రేణుల పరస్పర నినాదాలు, తోపులాట
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన పోలీసులు
- పార్టీ ఆఫీసుకు వినయ్‌భాస్కర్, ఇతర నేతల తరలింపు



హనుమకొండ నయీంనగర్‌లో ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు

వివరాలు 7వ పేజీలో..

చేయూతనిస్తే.. చేతికర్రతో ఏం పని?

- జీవిత చరమాంకంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులు
- సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

వివరాలు 7లో

బతుకమ్మ దసరా ఏర్పాట్లపై సమావేశం

వేలేరు ,సెప్టెంబర్ 30: బతుకమ్మ, దసరా ఏర్పాట్లపై వేలేరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన రెవెన్యూ ,ఆరోగ్య శాఖ ,పోలీసు శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. రాబోయే బతుకమ్మ , దసరా ఏర్పాట్లలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా మెరుగైన సౌకర్యాలను అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు ,శాని టేషన్ వంటి ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. పనులు పూర్తి అయ్యే వరకు గ్రామాలలోజీపీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.



నయీంనగర్ బ్రిడ్జి సందర్శనలో వినయ్‌భాస్కర్, సుందర్‌రాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నయీంనగర్ బ్రిడ్జి వద్ద రణరంగం

- నిర్మాణ ఘనత తమదేనన్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్
- ఖండించేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నం
- ఇరు పార్టీల శ్రేణుల పరస్పర నినాదాలు, తోపులాట
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన పోలీసులు
- వాహనాల్లో వినయ్‌భాస్కర్, ఇతర నేతల తరలింపు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 30 : హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ ఘనతపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఉద్రిక్తతకు దారితీశాయి. నిన్నటి వరకు మీడియా, ఇతర మార్గాల్లోనే జరిగిన మాటల యుద్ధం.. సోమవారం ఏకంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల ప్రత్యక్ష యుద్ధానికి దారితీసింది. దీంతో నయీంనగర్ బ్రిడ్జి ప్రాంతం రణరంగంగా మారింది. పరిస్థితి చేయి దాటుతున్న క్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు బ్రిడ్జిని పరిశీలించి రోడ్డుపై బైఠాయించారు. ఆ సమయంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేయగా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వారిని చెదరగొట్టి.. వినయ్‌భాస్కర్ ఇతర బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని వాహనాల్లో తరలించారు. మొత్తంగా సుమారు రెండు గంటల పాటు నయీంనగర్ బ్రిడ్జి వద్ద హై టెన్షన్ వాతావరణం కనిపించింది.

జరిగిందేంటంటే..


నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణమే కాదు బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడ వీధులతో పాటు ఇతర అభివృద్ధి పనులను తొమ్మిది నెలల వ్యవధిలోనే చేపట్టామంటూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రకటిస్తూ వచ్చారు. దీనిపై పలు మార్లు స్పందించిన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆ ఘనత తమదేనని, తమ హయంలోనే నిర్మాణాలు చేపట్టామంటూ ప్రతి వాదన చేస్తూ వచ్చారు. 'మిత్ర' సంబోధం చేస్తూనే ఇద్దరూ తమ రాజకీయ వైరాన్ని బహిర్గతం చేస్తుండటం నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే నయీంనగర్ మాత్రమే కాదు పలు అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని నాయిని సవాల్ విసిరారు. అంతేకాదు హనుమకొండలో తాము చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఘనతగా చెప్పుకొంటుందంటూ మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొంటున్నారన్న ఎమ్మెల్యే నాయిని కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబరు 29న బ్రిడ్జి వద్ద చర్చకు రావాలని కేటీఆర్, వినయ్‌భాస్కర్‌కు ఆయన సవాల్ కూడా విసిరారు. తన సవాల్ మేరకు రాజేందర్‌రెడ్డి ఆదివారం బ్రిడ్జి వద్దకు వచ్చి మీడియాతో మాట్లాడారు. నయీంనగర్ బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణం వరకు జరిగిన ప్రక్రియ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నిధుల మంజూరు, నిర్మాణ పూర్తి వరకు వివరిస్తూ బీఆర్ఎస్ నేతల తీరును ఖండించారు.

ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11గంటలకు నయీంనగర్ బ్రిడ్జి సందర్శనకు మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వచ్చారు. అప్పటికే నయీంనగర్ బ్రిడ్జి వద్ద మీడియా సమావేశం ఉంటుందని కాంగ్రెస్ ప్రకటించగా మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు తోట వెంకన్న, రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు అజీజ్‌ఖాన్, రజాలీ, అబూబాకర్ తదితరులు బ్రిడ్జికి కొద్ది దూరంలో నిలిచారు. బీఆర్ఎస్ సందర్శన తరువాత మీడియాతో మాట్లాడేందేకు వారంతా సిద్ధమయ్యారు. కానీ అప్పటికే పరిస్థితి వేడెక్కింది.

ఉద్రిక్తతు దారి తీసిన వైనం

మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మీడియాతో మాట్లాడిన తరువాత బ్రిడ్జి వద్దకు వచ్చేందుకు మేయర్ గుండు సుధారాణి ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఆ సమయంలోనే కార్యకర్తలు తోపులాటకు దిగడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. వారు ఘర్షణ పడడంతో బ్రిడ్జి రణరంగానికి వేదికగా మారింది. అప్పటికే అక్కడ మోహరించిన అప్రమత్తమై ఇరువర్గాలకు నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో వారు చెల్లా చెదురు చేశారు. కానీ పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు శ్రమించాల్సి వచ్చింది. రోడ్డుపై బైఠాయించిన వినయ్‌భాస్కర్ ఇతర నాయకులను పోలీసులు వాహనాల్లో బీఆర్ఎస్ కార్యాలయానికి తరలించారు. ఇక ఆ పక్కనే ప్రజాభవన్ ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే నయీంనగర్ బ్రిడ్జి విషయంలో బీఆర్ఎస్ హయాంలో నాడు ఆ పార్టీలో ఉన్న నాయకులే.. నాటి ప్రతిపక్ష, నేటి అధికార కాంగ్రెస్ వైపు మాట్లాడటాన్ని చూసిన స్థానికులు ఇదేనేమో రాజకీయ సిత్రం అంటే అని చర్చించుకోవడం కనిపించింది.

ఆనాడే నగరాభివృద్ధి ప్రణాళికలు : మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



నయీంనగర్ బ్రిడ్జిని సందర్శించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఇతర బీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయంలోనే నగరాభివృద్ధి కోసం రూ.500 కోట్ల ప్రణాళికలు సిద్ధమయ్యాయని వినయ్‌భాస్కర్ వెల్లడించారు. నయీంనగర్ బ్రిడ్జి, నాలా విస్తరణతో పాటు మరికొన్ని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. నిధుల మంజూరు, అవసరత ప్రాధాన్యత క్రమంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమైనట్లు వివరించారు. గొప్పలు చెప్పుకోవడం తమకు ఇష్టం లేదని, కేయూ వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం, ఆపై నయీంనగర్ బ్రిడ్జి చేపట్టేందుకు సిద్ధమైన క్రమంలో ఎన్నికలు వచ్చాయని వివరించారు. నాడు మంజూరైన నిధులతోనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఆ ఘనతను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తమదిగా చెప్పుకొంటున్నారని, రాష్ట్రం కోసం పోరాడిన చరిత్ర తమదని, ఎమ్మెల్యే నాయిని తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్‌ది రాజకీయ రాద్ధాంతం : మేయర్ గుండు సుధారాణి



అసత్యప్రచారాలతో బీఆర్ఎస్ రాజకీయ రాద్ధాంతం చేస్తోందని మేయర్ గుండు సుధారాణి విమర్శించారు. నయీంనగర్ బ్రిడ్జి వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. గతంలో వరదల సమయంలో నగరం ముంపునకు గురైందని, బీఆర్ఎస్ హయంలో బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలు మాత్రమే జరిగాయని, నిర్మాణం చేపట్టలేదన్నారు. నిధుల కేటాయింపు కూడా లేదని ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బాహాటంగానే చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజేందర్‌రెడ్డి నయీంనగర్ బ్రిడ్జితో పాటు కాళోజీ కళాక్షేత్రం ఇతర అనేక అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించుకున్నారన్నారు. నయీంనగర్ పాత బ్రిడ్జి కూల్చివేసి నాలుగు నెలల్లోనే నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారని తెలిపారు. నిధులు తీసుకొస్తేనే కదా బ్రిడ్జి నిర్మాణమే కాకుండా ఇతర అభివృద్ధి పనులు పూర్తి అవుతున్నాయంటూ వివరించారు. దీనిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని, తమ హయంలోనే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టామంటూ వినయ్‌భాస్కర్ చెప్పడం అసత్య ప్రచారమని కొట్టి పారేశారు.

ఎంపీడీవో కార్యాలయం ఐనవోలుకు మార్పు

- ఆదేశాలు జారీచేసిన కలెక్టర్



ఎంపీడీవో కార్యాలయం మార్పుపై కలెక్టర్, ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, సెప్టెంబరు 30: ఐనవోలు ఎంపీడీవో కార్యాలయాన్ని తక్షణమే హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి ఐనవోలు మండలకేంద్రానికి మార్చాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీచేశారు. ఏడేళ్ల కిందట ఏర్పడిన ఐనవోలు మండల కేంద్రంలో నేటికీ ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లిలో ఐనవోలు ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతోంది. ఈ కార్యాలయాన్ని ఐనవోలుకు మార్చాలని గతంలో ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. సోమవారం ఐనవోలు కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం సమస్యపై ఆంధ్రజ్యోతి కథనాలను టెస్కాబ్ చైర్మన్ దృష్టికి పలువురు తీసుకెళ్లగా ఆయన నేరుగా కలెక్టర్, ఎమ్మెల్యే వద్దకు వెళ్లి ఎంపీడీవో కార్యాలయాన్ని హనుమకొండ నుంచి ఐనవోలుకు మార్చడానికి జరుగుతున్న జాప్యంను వివరించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లును పిలిచి కార్యాలయంను తక్షణమే ఐనవోలుకు మార్చాలని అందుకు కావాల్సిన ఆదేశాలను జరీచేస్తానన్నారు. సాయంత్రం కలెక్టరేట్‌కు రావాలని కలెక్టర్ ఎంపీడీవోకు స్పష్టం చేశారు. దీంతో ఎంపీడీవో కార్యాలయాన్ని హనుమకొండ నుంచి ఐనవోలుకు మార్చడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో కలెక్టర్‌కు లేఖపెట్టడం వెంట వెంటనే జరిగిపోయింది. ఒకటి రెండు రోజుల్లో హనుమకొండలోని కార్యాలయాన్ని ఖాళీ చేసి ఐనవోలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న హాస్టల్ భవనం లేదా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నటు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతి తెలిపారు.

రామన్నగూడెం యువకులది సహజ మరణమే

- నిర్ధారించిన వరంగల్ ఫోరెన్సిక్ ల్యాబ్

నర్సింహులపేట, సెప్టెంబరు 30: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో ఒకేరోజు ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మిస్టరీ వీడింది. ఆ యువకులది సాధారణ మరణమేనని వరంగల్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నర్సింహులపేట ఎస్సై మాలోత్ సురేష్ సోమవారం వివరాలు వెల్లడించారు. రామన్నగూడెం గ్రామంలో ఈ ఏడాది జూన్ 10న స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న బొల్లోజు శ్రావణ్, ఎస్‌కె రహీమ్, ఉపేంద్రాచారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి మెరుగైన వైద్యం అందించినా బొల్లోజు శ్రావణ్, ఎస్‌కే రహీమ్ మృతి చెందడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తింది. వీరి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ వారు ఇచ్చిన నివేదిక ప్రకారం యువకుల శరీరంలో ఎలాంటి విషపూరిత ఆహారం కలవలేదని, ఆ యువకులు సహజంగానే మృతి చెందినట్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై సురేష్ తెలిపారు. అయితే యువకుల మృతిపై రామన్నగూడెం వాసుల అనుమానాలకు ఈ ల్యాబ్ ఇచ్చిన నివేదికతో తెరపడింది.





రక్తదానం.. ప్రాణదానం

- ఆపన్నహస్తం అందిస్తున్న రెడ్‌క్రాస్
- రోగులను ఆదుకుంటున్న ఎంజీఎం బ్లడ్ బ్యాంక్
- ఎందరికో జీవం పోస్తున్న దాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 : రక్తదానం అంటే ప్రాణదానం.. అవసరమైన వ్యక్తికి రక్తాన్ని దానం చేయడం మానవుడి నైతిక విలువల్లో ఒకటి. ప్రపంచంలో ప్రతీ 2 సెకన్లకు ఎవరో ఒకరు రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్నవారి రక్తం ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుంది. స్వచ్ఛందంగా రక్త దానం చేయడానికి ఎందరో ముందుకు వస్తున్నారు. కొందరు 50 సార్ల కన్నా ఎక్కువగా రక్తదాన చేసినవారున్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, పైగా వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్లు చెబుతున్నారు. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, రక్తదాతలను ప్రోత్సహించడానికి ప్రతీ సంవత్సరం అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎక్కువ సార్లు రక్తదానం చేసి ఎందరో ప్రాణాలు కాపాడిన వారు చాలామందే ఉన్నారు. అయితే రక్తదానం చేయడం మంచిది కాదని ఎంతోమంది అపోహపడుతుంటారు. కానీ రక్తదానం వల్ల క్యాన్సర్ రిస్క్‌ను తగ్గించుకోవచ్చని, గుండె సంబంధ వ్యాధులు దరిచేరవని, రక్తపోటు నియంత్రణకు సహాయపడుతుందని, ఏడాదికి రెండు, మూడు సార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కొవ్వును తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే రక్తదానం చేసేవారు వైద్యుల సూచనలు, కొన్ని పరీక్షల తర్వాత చేయాల్సి ఉంటుంది.

రోగుల సేవలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్

వరంగల్ ఎంజీఎంలోని బ్లడ్ బ్యాంక్ అవసరమైనంత రక్తాన్ని రోగులకు సమకూర్చడం ద్వారా విశేషమైన సేవలందిస్తోంది. పూర్తిగా రక్తం కావాల్సినవారికి రక్తం, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ఎర్రరక్త కణాలు మాత్రమే అవసరమైనవారికి రక్తం నుంచి వేరు చేసి అందజేస్తోంది. తలసేమియా, రక్తహీనత, క్యాన్సర్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తాన్ని ఉచితంగా ఇస్తోంది. ఏటా 11వేల యూనిట్ల రక్తాన్ని రోగులకు సమకూరుస్తున్న ఈ బ్లడ్ బ్యాంక్ ఆ మేరకు అసవరమైన రక్తాన్ని సేకరించేందుకు ప్రతీ నెల నాలుగు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా, ప్రైవేటు ఆసుపత్రుల రోగులకు మాత్రం యూనిట్ రూ.1050 చొప్పున అందజేస్తోంది. ప్రతి రక్తదానం చేస్తే వారికి కావాల్సిన గ్రూప్ రక్తాన్ని రూ.800 ఇస్తోంది. అలాగే హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్ఎస్) కూడా రక్త సేకరణ, సరఫరాలో ప్రముఖపాత్ర పోషిస్తోంది. తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తోంది. రక్తాన్ని నిల్వ చేయడానికి, రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్, ఎర్ర రక్తకణాలను వేరు చేయడానికి అధునాతనమైన పరికరాలు ఇందులో ఉన్నాయి. ఏటా రక్తదాన శిబిరాలను నిర్వహించడమే కాకుండా రక్తదాతలను ప్రోత్సహిస్తోంది.

ఆ సంఘటనే నన్ను రక్తదాతగా మార్చింది.. : భాస్కర్, రక్తదాత



వరంగల్ దేశాయిపేటకు చెందిన భాస్కర్ వృత్తి రీత్యా ప్రైవేటు ఉపాధ్యాయుడు. 2007లో తన సోదరుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో శస్త్రచికిత్సకు రక్తం అవసరమై రెండ్రోజుల పాటు అనేక మందిని సంప్రదించారు. కానీ రక్తం దొరక్కపోవడంతో చివరకు తాను రక్తం ఇవ్వడంతో ఆపరేషన్ జరిగి తన సోదరుడు కోలుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేసిన భాస్కర్ ప్రతీ మనిషి రక్తదానం చేస్తే ఎందరో ప్రాణాలు నిలుస్తాయని, తన అన్న ఉదంతం తనను రక్తదాతగా మార్చిందని చెబుతున్నారు.

131 సార్లు రక్తదానం చేసిన రాజేశ్వర్‌రావు



వరంగల్‌లోని మట్టెవాడకు చెందిన తోట రాజేశ్వర్ రావు ఆర్య ఇప్పటి వరకు 131 సార్లు రక్తదానం చేశారు. రక్తదానం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. తన 20వ ఏట నుంచి మొదలు పెట్టి ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 131 సార్లు రక్తదానం చేసి రికార్డు నెలకొల్పారు. అంతేకాదు రక్తదానంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆదుకుంటూ ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.



26 సార్లు రక్తదానం చేశా : మధు

పెరుమాండ్ల మధు వృత్తిరీత్యా జర్నలిస్టు. రక్తదానం సామాజిక బాధ్యతగా ఇప్పటి వరకు 26 సార్లు రక్తదానం చేశారు. మన ముచ్చట్లు అనే సంస్థ ద్వారా ఆయన పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆ సంస్థ ద్వారా పలుమార్లు రక్త దాన శిబిరాలు నిర్వహించారు. అందరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.





చేయూతనిస్తే.. చేతికర్రతో ఏం పని?

- జీవిత చరమాంకంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులు
- సంక్షేమ శాఖ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 29 : నవమాసాలు మోసి, కని ఒక బతుకునిస్తారు. ఆ పిల్లల బతుకులు చల్లగా ఉండాలని మనసారా కోరుకుంటారు. వారిని ప్రయోజకులను చేయడంలోనే అలసిపోయినా జీవిత పయనంలో తామూ సేద దీరాలని ఆశిస్తారు. బిడ్డల ప్రేమ లభిస్తే చాలు. తమను కంటికి రెప్పలా చూసుకుంటే చాలు తమకంతకన్నా ఏం కావాలి భగవంతుడా.. అని కలలు కంటారు. కానీ ఆ కలలు చిద్రమైతే.. బాధ్యత మరిచి బిడ్డలు తమను భారంగా భావిస్తే.. ఎలాగైనా వదిలించుకోవాలని చూస్తే ఆ తల్లిదండ్రుల మనసులు ముక్కలవుతాయి. అలా ప్రస్తుత సమాజంలో ఎంతో మంది వృద్ధులు దేవుడిపైనే భారం వేసుకుంటూ దిక్కులేని వారిగా మౌనంగా రోదిస్తూ రోడ్డున పడుతున్నారు. తమ కనుపాపల ఆలనాపాలనాకు నోచుకోక.. ఉప్పెనలా వచ్చే కన్నీటి సునామీని దిగమింగుతూ.. బాధను బయటి వారికి చెప్పి తమ కన్నవారిని తక్కువచేయలేక చేయూతనిచ్చే వారు లేక.. చేతికర్రే ఆసరగా.. ఆశ్రమాలే ఆశ్రయంగా.. దుఃఖ దినాలను గడుపుతున్నారు. అలాంటి వారి నిస్సహాయస్థితిని ప్రపంచానికి చూపుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోని కన్నవారిని గుణపాఠాలు చెప్పేలా 'ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని' జరుపుతున్నారు. వయోజనుల హక్కుల ఉల్లంఘన, వారిని మానసికంగా, శారీరకంగా వేధించే చర్యలు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న క్రమంలో 2002లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యుహెచ్‌వో) ప్రపంచాన్ని ఈ అంశంపై మేల్కొలిపే చర్యలను చేపట్టింది. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వ సంస్థలు, మేధావి, సామాజిక వర్గాలు వయో వృద్ధుల సమస్యలపై గళమెత్తాయి. ఈ క్రమంలోనే అక్టోబరు 1వ తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ముందస్తుగా వారోత్సవ కార్యక్రమాలు

జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు వారోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 25న ప్రారంభమైనా ఈ కార్యక్రమాల్లో వృద్ధుల హక్కులు, చట్టాలు, బిడ్డల పోషణ బాధ్యత తదితర అంశాలపై ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు.

చేయూత లేక.. ఆశ్రయం దొరక్క..

జీవితమంతా కడుపునపుట్టిన పిల్లల బాగోగులు, వారి ఉన్నతి కోసం శ్రమించిన తల్లిదండ్రులకు ప్రస్తుతం వృద్ధాప్యం ఓ భారంగా మారుతోంది. గుండెల్లపై ఆడుకున్న బిడ్డలే.. పెద్దయ్యాక గుండెలపై తన్నుతుంటే భరించలేక మరింత కుంగిపోతున్నారు. సూటిపోటి మాటలు.. వేధింపులు.. అగౌరవ పరిస్థితుల మధ్య జీవిత చరమాంకాన్ని నరకంగా భరించాల్సిన దుస్థితిలో ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ పిల్లలు విదేశాలకు వెళుతుండటంతో ఎంతో మంది తల్లిదండ్రులు స్వగ్రామాల్లో ఒంటరి జీవితాలు గడుపుతున్నారు. ఏడాదికో.. రెండేళ్లకో.. పండుగలు పబ్బాలకు వచ్చినా.. ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లో చేతిలో పట్టుకుని సెల్‌ఫోన్లతోనే కాలక్షేపం చేస్తున్నారు తప్ప తల్లిదండ్రుల బాగోగుల గురించి పట్టించుకోని వారెందరో ఉన్నారు. ఇక కొందరైతే ఏళ్లతరబడి విదేశాల్లోనే ఉంటూ ఆన్‌లైన్ పలకరిస్తున్నారు. మరి కొందరు వృద్ధుల జీవితమైతే దారుణం. బిడ్డలు తరిమివేయడం, కోడళ్లు, కుటుంబ సభ్యులు ఈసడించుకోవడం లాంటి పరిణామాలతో తల్లడిల్లుతున్నారు. చిన్నతనంలో బిడ్డల కంట నీరొస్తే తట్టుకోలేకపోయిన ఆ తల్లిదండ్రులకు.. ఆ బిడ్డలే పెద్దాయ్యాక కన్నవారిని వృద్ధాశ్రమాల్లో నిస్సిగ్గుగా, నిర్దయగా చేర్పి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇలా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించినా, వారికి ఆర్థిక బాధలు కలగజేసినా కఠిన చర్యలు ఎదుర్కొవాల్సిందే. తల్లిదండ్రులు తమ బిడ్డల నిరాధరణపై ఆర్‌డీవోకు విజ్ఞాపన చేస్తే చట్టరీత్యా విచారణ జరిపి ఆ తదుపరి చర్యలను ఎదుర్కోవాల్సిందే. బిడ్డలు ఉద్యోగులైతే వారి వేతనాల నుంచే కోత విధించే అవకాశాలున్నాయి.

చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవాల్సిందే..

వృద్ధుల ఆలనాపాలనా విషయంలో బిడ్డలు ఏమాత్రం ఇబ్బందులు పెట్టినా చట్టరీత్యా తీసుకునే చర్యలను ఎదుర్కోవాల్సిందే. ముఖ్యంగా వారికి సరైన వైద్యం ఇప్పించడంలో నిర్లక్ష్యం చేయడం, దురేద్దశపూర్వకంగా వారికి అధిక మోతాదులో మందుల ఇవ్వడం, ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పెట్టడం, కనీస వసతుల కల్పనను విస్మరించడం లాంటి ఎన్నో అంశాలు వయోజన వేధింపుల పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సమస్యలపై వృద్ధులు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా శిక్ష తప్పదు. 1973 సెక్షన్ 125 ప్రకారం తమను తాము పోషించుకోలేని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులకు వారి పోషణకయ్యే ఖర్చులను పిల్లలే భరించాలి. అలాగే సెక్షన్ 24ప్రకారం ఏదైనా దురుద్దేశంతో వృద్ధుల సంరక్షణ బాధ్యతలను వదిలేస్తే జైలు శిక్ష, జరిమానా కూడా ఉంటుంది.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబరు 14567

పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు న్యాయపరంగా పోరాడేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తమకు జరిగే అన్యాయంపై 14567 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు. దాంతో ప్రత్యేక విభాగం అధికారులు విచారణ జరిపించి వృద్ధులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారు.

పండుగలోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మునిసిపల్ సమావేశంలో కౌన్సిలర్ల మండిపాటు

జనగామ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జనగామ మునిసిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచి పోయాయని కౌన్సిలర్లు అధికారుల తీరుపై మండిపడ్డారు. జనగామ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ గాదెపాక రాంచందర్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వెంటనే కుక్కల బెడదను నివారించాలన్నారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా వాటర్ కోసం తవ్విన పైపు లైన్ పని పూర్తి చేసిన తర్వాత ప్యాచ్‌వర్క్ చేయకపోవడంతో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయని వెంటనే మరమ్మతు పనులు చేయించాలన్నారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ప్రత్యేక బస్సులను నడపాలని, బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్ వరకు లోకల్ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. గతంలో సాంక్షన్ అయిన అభివృద్ధి పనులు కాంట్రాక్టర్లు పని చేయడంలేదని వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ వార్డులో సానిటేషన్ పనులు సరిగా చేయడంలేదని కాలనీవాసులు దుర్వాసనతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిలర్ పగిడిపాటి సుధా సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ 3వ వార్డులో పనిచేసే సానిటేషన్ సిబ్బందిని కలెక్టర్ కార్యాలయానికి మళ్లించడంతో సానిటేషన్ పనులు కావడం లేదని, దీంతో స్థానిక ప్రజలకు అసౌకర్యం కలుగుతుందన్నారు. కౌన్సిలర్ ఊడ్గుల శ్రీలత మాట్లాడుతూ వార్డులో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, మినీ ట్యాంకును ఏర్పాటు చేయాలని గతంలో అనేక సార్లు విన్నవించినప్పటికీ ఏర్పాటు చేయడం లేదన్నారు. కౌన్సిలర్ గంగరబోయిన మల్లేష్ మాట్లాడుతూ సెక్షన్లకు సంబంధం లేని వారిని, అనుభవం లేని వారిని జవానుగా నియమించడం సరైంది కాదన్నారు. మరో కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ ఎజెండా పంపిన తరువాత టేబుల్ ఎజెండాలను పంపడం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో ఎజెండా లోని 24 అంశాలు, 14 టేబుల్ ఎజెండాలలో ఒకటి మినహా అన్నింటికీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్తా

ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 30: అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం మండలంలోని శామీర్‌పేటలోని రమాదేవి ఫంక్షన్ హాల్లో ఐసీడీయస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మా ట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత బారిన పడకుండా ఈ పోషణ మాసం కార్యక్రమాన్ని నిరంతరం ప్రక్రియగా కొనసాగించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి పౌష్టికాహా రం, ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ప్రతీ ఒక్క సూపర్‌వైజర్ అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారుల పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. న్యూట్రిషన్ గార్డుల ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. గర్భిణీలకు సీమంత వేడుకలను నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్య ప్రణాళిక స్టాల్‌ను సందర్శించారు. పలు సూచలను చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో జయంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్ జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, డీపీవో స్వరూప సీడీపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు ఓటు నమోదు చేసుకోవాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 30: అర్హులైన ప్రతీ ఒక్క టీచర్ ఓటరుగా నమోదు చేసుకోవాలని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ శాసనమండలి టీచర్ల ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్క టీచర్ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫార్మ్-19 ద్వారా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో సంబంధిత అధికారులను సంప్రదించి తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సాధారణం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 30: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సాదారణమని జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి అన్నారు. సోమవారం కళాశాల అటెండర్ గుజ్జు వెంకటస్వామి పదవీ విరమణ సభలో ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడారు. ఆయన సేవలను కొనియా డారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆయనను శాలువాతో సన్మానించారు.

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

జనగామ కల్చరల్, సెప్టెంబరు 30: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు అక్టోబరు 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు జనగామ డీఈఓ కె.రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 నిష్పత్తిలో ఎంపికై, మొబైల్‌కి మెసేజ్ వచ్చిన అభ్యర్థులు మంగళ, బుధ, గురువారాలలో జనగామ జిల్లా కేంద్రం లోని ప్రెస్టన్ ఉన్నత పాఠశాలలో సంబంధిత ధృవపత్రముల రెండు సెట్ల జిరాక్స్ కాపీలపై గజిటెడ్ సంతకం చేయించుకొని హాజరు కావాలన్నారు. వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు..

తరిగొప్పుల, సెప్టెంబరు 30: ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టగా ఓ వృద్ధుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండంలోని వాచ్చతండా గ్రామానికి చెందిన భూక్య హరియా(65) మండల కేంద్రం నుంచి తన ద్విచక్రవానం మీద తన గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఓ కారు అదుపు తప్పి హరియా ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాల య్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా బాధితుడికి మెరుగైన చికిత్స అందించేందుకు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రీడల్లో శివునిపల్లి విద్యార్థుల ప్రతిభ


క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 30: స్థానిక శివునిపల్లి హైస్కూల్ విద్యార్థిని ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో సత్తా చాటింది. హనుమకొండలో నిర్వహించిన పోటీల్లో టెన్త్ విద్యార్థిని భూక్య దీపిక కటాస్‌లో పాల్గొని ద్వితీయ బహుమతిగా రజత పతకం కైవసం చేసుకుంది. అలాగే మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పోటీ పడిన పాఠశాల విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీలో నితిన్, బి.దీపిక, జి.శ్రీవాణి, ఎస్‌కే. ఆదిల్, ఖోఖోలో జి.అక్షిత, అంకిత, స్పందన, జి.ప్రసన్న, జి.రాంచరణ్, ఎ.జగన్, వాలీబాల్‌లో మణికంఠ, రుత్విక్, నాని, జి.చరణ్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం కె.రమేశ్, పీడీ కొండ రవి అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జి.రాధిక, ఉపాధ్యాయులు కె.ప్రవీణ్, టి.శ్రీనాథ్, ఎస్.శ్రీనికాంత్, కృష్ణవేణి, వసంత కుమారి, లక్ష్మీ ప్రసాద్, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేపూర్ హెచ్ఎం సరోజనకు సన్మానం

చిలుపూర్, సెప్టెంబరు 30 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఫతేపూర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం సరోజనను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం పంచాయతీ సెక్రటరీ పెండ్లి హరిప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రామస్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. హెచ్ఎం సరోజనను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. రమేష్, రతన్‌సింగ్, ప్రతాప్‌సింగ్, బానోత్ బాలరాజు, భూక్య కుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలి : కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 30: అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం మండలంలోని శామీర్‌పేటలోని రమాదేవి ఫంక్షన్ హాల్లో ఐసీడీయస్ అధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత బారిన పడకుండా ఈ పోషణ మాసం కార్యక్రమాన్ని నిరంతరం ప్రక్రియగా కొనసాగించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి పౌష్టికాహారం, ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ప్రతి ఒక్క సూపర్‌వైజర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారుల పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. న్యూట్రిషన్ గార్డుల ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. గర్భిణీలకు సీమంత వేడుకలను నిర్వహిం చారు. పూర్వ ప్రాథమిక విద్య ప్రణాళిక స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో జయంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, డీపీవో స్వరూప సీడీపీవో రమాదేవి పాల్గొన్నారు.

సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న ప్రభుత్వం

బచ్చన్నపేట, సెప్టెంబరు 30: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పోరేట్ సంస్థలకు దోచిపెట్టి, భారాన్ని పేదలపై మోపుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో సీపీఎం 8వ గ్రామ మహాసభ జరిగింది. హాజరైన అబ్బాస్ మాట్లాడుతూ ప్రజలపై బీజేపీ ప్రభుత్వం నియంతృత్వం కొనసాగిస్తుందన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు అంబానీ, ఆదానీలకే సంపద దోచిపెడతారన్నారు. నిత్యావసర ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని, ప్రజలపై పడే భారాలను తగ్గించేందుకు కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో చిత్తశుద్ధి చూపటం లేదన్నారు. రైతు రుణమాఫీ, ఇంటి నిర్మా ణాలు, రేషన్‌కార్డుల విషయంలో గందరగోళం కొనసాగు తోందన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చటం సరైన విధానం కాదన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపిన తరువాతే ప్రభుత్వం ముందుకు సాగాలన్నారు. నిరుద్యోగ సమస్య తీర్చేందుకు అవసరమైన పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు గ్రామంలో దప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పతాకావిష్కరణ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, మినలాపురం ఎల్లయ్య, రామగళ్ల అశోక్, ఐలయ్య, బాల్‌నర్సయ్య, మనోహర్, నాగరాజు, రవి పాల్గొన్నారు.


ర్యాలీ తీస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు

రైతులకు పీఏసీఎస్ చేయూత

నర్మెట, సెప్టెంబరు 30 : రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అన్ని రకాల రుణాలు అందించి చేయూతనిందిస్తుందని డీసీసీబీ డైరక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ లో 1877 మంది రైతులకు రూ. 14.60 కోట్ల పంట రుణాలను అందించినట్లు తెలిపారు. రుణమాఫీ 1822 రైతులకు 1056 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, 766 మంది రైతులకు ఇంక జరగాల్సి ఉందన్నారు. రుణమాఫీ వచ్చిన రైతులకు 732 మంది రైతులకు తిరిగి పంట రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 50 మంది రైతులకు రూ. 56 లక్షలు గోల్డ్ లోన్ ఇచ్చినట్లు చెప్పారు. సోమవారం 50 మంది రైతులకు గాను రూ. 50 లక్షల నూతన పంట రుణాలను అందించారు. గతంలో డి కేటగిరిలో ఉన్న నర్మెట పీఏసీఎస్‌ను తమ పాలకవర్గం వచ్చాక ఎ కేటగిరి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో కొన్నె వెంకటయ్య, డైరక్టర్లు అర్జుల సుధాకర్‌రెడ్డి, నాగపూరి కిషన్, పాండ్యాల రమేష్, కూకట్ల చంద్రమౌళి, గడ్డం పరుశరాములు అంజయ్య, రాజయ్య, పీఏసీఎస్ సిబ్బంది ప్రజ్ఞాపురం మల్లయ్య, కేశవులు, శివ పాల్గొన్నారు.


రైతులకు పంట రుణాల చెక్కును అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్, సెప్టెంబరు 30 : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు డి.అరవింద్, కె.విక్రమ్, కె.హన్సిక, ఎస్.స్పందన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాలోని ఛాగల్లులో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో వీరు అత్యుత్తమ క్రీడా ప్రతిభను చాటడడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకాంత్, పీఈటీలు బి.రాజు, ఏ.శ్రీనాథ్ సోమవారం తెలిపారు. అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అరవింద్, విక్రమ్, హన్సిక, స్పందన పాల్గొంటారన్నారు.

'టీచర్స్ ఎమ్మెల్సీ' ఓట్ల నమోదు ప్రారంభం

బచ్చన్నపేట, సెప్టెంబరు 30: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ ప్రారంభించినట్టు ఎంఈవో వెంకటరెడ్డి తెలిపా రు. నవంబర్ 6 వరకు ఓటరు నమోదు, 23న ముసాయిదా ప్రకటించి, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి 30న తుది జాబితా ప్రకటించటం జరుగుతుందన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

కొడకండ్ల, సెప్టెంబర్ 30 : మండలకేంద్రంలోని టీజీఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముందస్తు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

ప్రారంభమైన ప్రభుత్వ భూముల సర్వే

కొడకండ్ల, సెప్టెంబర్ 30 :ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని ప్రభుత్వ భూముల సర్వేను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సర్వే అధికారుల బృందం సోమవారం ప్రారంభించారు. తెలంగాణా రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా బృందం ప్రభుత్వ భూములలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేస్తుండటంతో మండలకేంద్రంలోని ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకున్న వారిలో భయం మొదలైంది. మండలకేంద్రంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతుంది. ప్రసారమాధ్యమాల్లో హైడ్రాపై వస్తున్న వార్తలను వారు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ సర్వేలో రామారావు, నరేష్, విజయ్‌కుమార్, బి.సతీష్, స్టేషన్ ఘన్పూరు డీటీ సదానందం, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల దయాకర్ డాక్టరేట్ ప్రదానం


చిట్యాల దయాకర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న దృశ్యం

చిలుపూర్, సెప్టెంబరు 30 : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సామాజిక సేవలందిస్తున్న వంగాలపల్లికి చెందిన చిట్యాల దయాకర్‌కు ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ - స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఆఫ్ ఇండియా డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని లోని తెలంగాణ సారస్వత ప్రసాద్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం స్ఫూర్తి సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి గూడూరు చెన్నారెడ్డి, ఆకుల రమేష్, కన్నడ సినీ నటుడు అశోక్ షేక్, హుస్సేన్ పర్వీన్, నాగస్వామి తదితర చేతులమీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ, డాక్టరేట్‌ను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సేవా రంగంలో మరింతగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సాధికారత సాధ్యం

వరంగల్ ఎంపీ కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30: మహిళా సాధికారత అంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కాదని మహిళలు ఆరోగ్యంగా ఉండడమని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్, పోషణ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఎంపీ కావ్య ముఖ్య అతిధిగా హాజరైనారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ పరిధిలో వివిధ మండలాలకు చెందిన బాలింతలు, గర్భినీలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నేరుగా మహిళలతో మాట్లాడి అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పోషకాహారం అందుతుందా అందలేదా అని తెలుసుకున్నారు. బాలమృతం ప్యాకెట్స్ అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ప్రతీ ఇంటికి మూల స్థంభం ఇల్లాలు అనేది వాస్తవం అన్నారు. మహిళలు మొహమాటం పడకుండా ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన దాచుకోకుండా వైద్యులకు చెప్పుకోవాలని కోరారు. 40ఏళ్ల వయస్సు దాటిన మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భ సంచి ముఖ ద్వారా క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంధ్య, వైద్యులు డాక్టర్ జనార్ధన్, డాక్టర్ సంధ్య, సూపర్‌వైజర్స్ సంధ్యరాణి, అనిత, టీచర్లు మారపాక ధనలక్ష్మి, రాణి, రమ, రజిత, స్వప్న, సునీత, నాయకులు శిరీష్ రెడ్డి, గుజ్జరి రాజు, శీరాములు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని వినతి

పాలకుర్తి, సెప్టెంబరు 30 : కులాలు వేరైనప్పటికి ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆ జంటకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం రజక వృత్తిదారుల సంఘం, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్‌కిశోర్ ఝాకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి చిట్యాల మంజుల మాట్లాడుతూ పాలకుర్తి మండలం కోతులబాదు గ్రామానికి చెందిన ఇద్దరు కులాంతర వివాహం చేసుకోవడంతో అమ్మాయి కుటుంబానికి చెందిన బంధులు దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారికి రక్షణ కల్పించాలని కోరారు. వారి వెంట బాధిత కుటుంబ సభ్యులు చిట్యాల నర్సమ్మ, ఏదునూరి రాధిక, కంచర్ల కుమారస్వామి, మానస, సబిత ఉన్నారు.

నిరుపేద విద్యార్థికి చేయూత

చిలుపూర్, సెప్టెంబరు 30 : మండలంలోని మల్కాపూర్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని కుసుమ శ్రీవల్లి ఇంజనీరింగ్ చదువుల కోసం కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ 35 వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి నేతృత్వంలో విద్యార్థిని తల్లిదండ్రులు రాజు - స్వప్న దంపతులు హనుమకొండలోని కడియం నివాసంలో ఎమ్మెల్యే శ్రీహరిని కలిసి వారి ఆర్థిక స్థితిగతులను వివరించారు. తమ కుమార్తె ఉన్నత చదువులకు ఆర్థిక సాయమందించాలని ఆయనను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నామాల మల్లేష్, పసుల వెంకటేశ్, ఊరడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తరిగొప్పుల, సెప్టెంబరు 30: మండల కేంద్రానికి చెందిన చింతల కృష్ణ సోలిపూర్ గ్రామంలో పంచాయతి కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ పాము కాటకు గురై గత నెల మరణించారు. ఆయనతోపాటు గతంలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల చేర్యాలలో 2009 - 2010లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి బాధిత కుటుంబ సభ్యుల పేరున రూ. 52000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఖాతా వివరాలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉరివేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30: మండలంలోని శివునిపల్లి గ్రామంలో పాలకుర్తి రోడ్డులో స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ ఒకటో ప్లాట్‌ఫామ్ పక్కన ఉన్న చెట్ల పొదల్లో ఓ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న మగ వ్యక్తి బ్లూ నిలువుగీతల ఫుల్ షర్టు ధరించి, లుంగీ పైన ఉన్నాడని తెలిపారు. ఉరి వేసుకున్న సమయంలో మృతుడి ఎడమ భుజంపైన టవల్ వేసుకొని ఉన్నాడని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. ఆచూకీ తెలిస్తే ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు. వివరాలు తెలిస్తే సమాచారమివ్వాలని తెలిపారు.

డీఎస్సీలో సంధ్య ప్రతిభ


సంధ్య

దేవరుప్పుల, సెప్టెంబరు 30: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యాబోధకురాలు(ఐఈఆర్పీ)గా దేవరుప్పుల మండల విద్యావనరుల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న జి. సంధ్య ఈ రోజు వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటింది. స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషన్), స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించింది. దీంతో సంధ్యను మండల విద్యాశాఖాధికారి గుంటిపల్లి కళావతి అభినందించారు. మండల ఉపాధ్యాయులు , ఎమ్మార్సీ సిబ్బంది రవీందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30: పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సంబంధిత కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని తానేదార్‌పల్లి, ఇప్పగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శపాఠశాల పనులను, నాస్ మాక్ టెస్ట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పూర్తైన పనులకు ఎంబీ రికార్డులు తయారు చేసుకొని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లు అందించి బిల్లులు పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రఘుజీ, సంపత్, మల్లారెడ్డి, అజయ్‌కుమార్ రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దండలో పోలీసుల కళాజాత


వెల్దండలో మాట్లాడుతున్న ఎస్సై ఎన్ నగేష్

నర్మెట, సెప్టెంబరు 30 : మండలంలోని వెల్దండ గ్రామంలో సోమవారం మత్తు పదార్థాలు, మూఢ నమ్మకాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎన్. నగేష్ మాట్లాడుతూ సామాజీక రుగ్మతలను నిర్మూలించి శాస్త్రీయ దృక్పథంతో కూడిన అవగాహన కల్పించేందుకు యువత, విద్యార్థులు, ముందుకు రావాలన్నారు.ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించవద్దన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.